# చంద్రోదయం

## 1

**కాం**తారావిక లోపల ఉండలేక బయటికొచ్చేశాడు. వావిలాల వారి పెరట్లో చెట్లమీదినించి చంద్రుడప్పుడే ఉదయిస్తున్నాడు. లోపల తన జీవితాన్ని రెండేళ్ళ పాటు వెలిగించిన మణి ముఖచంద్రబింబం అస్తమించుతున్నది.

ఆ గదినిండా జనం కిటకిట లాడుతూ కూర్చున్నారు. డాక్టరు యమధర్మరాజు మణి జీవితం నిమిషాల్లో ఉందని చెబుతూనే ఎవరైనా గట్టిగా ఊపిరి విడిస్తే కేసు వదిలి బయటికి నడుస్తానన్నాడు. క్షణాల్లో ఉంది. తన మణి చివరిసారి ఊపిరి విడిచేస్తుంది. వాళ్ళ దుఃఖం ఉప్పెనల్లే వచ్చి పడుతుంది. దాంతో తన గుండె కూడా బద్దలైపోతుంది. తను కూడా మణితో కలిసి వెళ్ళి పోవచ్చును.

మణి!

ఎక్కడా మంచివాళ్ళు – ప్రేమించదగిన వాళ్ళు లేరా? వాళ్ళలో లోపాలుండవా? మణిలో కూడా ఒక్క లోపం అలంకారార్థం ఉండరాదా? నాలుగైదేళ్ళు కాలేదే తన నోటి మీదిగా "మంచి గుణాలను ప్రేమించేదేమిటి? లోపాలనే ప్రేమించాలని!" అని. "మణీ! ఇంత అదృష్టం నా కెట్లా దొరికింది? నీ వంటి దేవత నాకు పెళ్ళాం కావటానికి నేనేం పుణ్యం చేసి ఉంటాను?" అని తను మణిని అడిగినప్పుడు మణి ఇట్లా అవుతుందని ఎట్లా ఊహించగలడు?

అందరు పెళ్ళాలంటి పెళ్ళాం కాదే తన మణి! తల్లి పోయిన్నాటినించీ తన జీవితానికి మాతృత్వమన్నది లేక అష్టకష్టాలూ పడి తన హృదయం అలిసినప్పుడు దాన్ని సముదాయించి చల్లగా నిద్రపుచ్చేవాళ్ళు లేక తనొక పద్మవ్యూహంలో చిక్కిపోయి, బోగం కొంపల్లో పడి ఉండి, ఓడానని చెప్పటం ఇష్టంలేక, ప్రజ్ఞకు పెనుగులాడుతూ, లోకాన్ని యావత్తూ ఎదుర్కొని నానా యాతనలూ పడుతున్నప్పుడు మణి దేవతా మూర్తల్లే వచ్చి తన్ను నరకంలో నించి యెకాయెకీ స్వర్గం చేర్చిందే! పదమూడేళ్ళ పిల్ల! అర్భకురాలు! లోకం తెలియనిది! ఎంత ఓర్పు! ఎంత నిదానం! ఇంతా ఇందుకా? అహో! పరమేశ్వరా!

తనకు భగవంతుడిలో గూడా నమ్మకం పుట్టించింది మణి! భగవంతుడు కాకపోతే

తన కటువంటి భార్య నెవరిస్తారు? భగవంతుడుంటే ఇట్లా ఎందుకు జరుగుతుంది? మనుష్యులే చెయ్యరే, భగవంతుడిచ్చి పుచ్చుకుంటాడా?

ఒక్కసారిగా లోపలి వాళ్ళంతా గొల్లుమన్నారు. అయిపోయింది. మణి అస్తమించింది. ఇక లోకం పాడే! ఆ చంద్రుడు తన్ను చూసి నవ్వుతున్నాడు. అనుకున్న ప్రకారం తన గుండె బద్దలైపోలేదు.

అయినా తనకు మణితో ఏం పని? తనెక్కడ, మణి యెక్కడ? కాంతారావుకు తనేం చేస్తున్నదీ తెలీదు. అతను బయటికొచ్చాడు. వాకిట్లో డాక్టరు కారు నిర్జీవంగా నిలిచి ఉంది, డ్రైవరు కారు లోపల అస్పష్టమైన ఆకారంతో కూచుని "అయిపోయిందా?" అన్నాడు. కాంతారావు విననివాడల్లే నిర్మానుష్యంగా ఉన్న వీథి వెంటబడి పిచ్చివాడల్లే నడవటం మొదలుపెట్టాడు.

## 2

ఉదయం ఏడూ ఏడున్నరప్పుడు నాళం వారి సత్రం ముందు ఒక దయ్యం తారట్లాడుతున్నది. ఆ వ్యక్తి కింకోపేరు కుదరక దయ్యమనవలసి వచ్చింది. మొహాన ఒక నెత్తురు చుక్క ఉన్నట్టులేదు. కళ్ళలో జీవం ఎంత మాత్రమూ లేదు. మనిషి సన్నగా, పొడుగ్గా, నాజూకుగానే ఉన్నాడు. గుడ్డలు చాలా మాసి ఉన్నై. మొహాన ఏ భావమూ కనపడలేదు. వెంకట్రావు సత్రంలో నించి ఎదురుగా ఉన్న హోటలుకు పోతూ చూశాడా దయ్యాన్ని. అతను కాఫీ తాగి వస్తుండగా ఇంకా ఆ దయ్యం తారట్లాడుతూనే ఉంది. ఈసారి వెంకట్రావు వెనక్కు తియ్యకుండా ఆ వ్యక్తిని సమీపించి "ఎవరు మీరు?" అన్నాడు.

"నన్నేమి అడక్కండి. నేను – నేనేమీ చెప్పే స్థితిలో లేను!" అన్నాడు కాంతారావు మొహాన బాధ సూచిస్తూ.

"సత్రంలో బస చేస్తారా?" అన్నాడు వెంకట్రావు.

కాంతారావు చేస్తానన్నట్టు తల ఊపాడు. వెంకట్రావు రమ్మని సత్రంలోకి దారి తీశాడు.

గుమాస్తాగారు సత్రంలో బస చేసిన వారికి పాత్ర సామాగ్రీ అవీ చూసి పెడుతున్నాడు. వెంకట్రావు గుమాస్తాగారి గదిలోకి వెళ్ళి "ఏమండి గుమాస్తాగారూ, వీరికి గది ఒకటి ఇప్పించగలరా?" అన్నాడు.

"వారి పేరు?" అన్నాడు గుమాస్తా తల ఎత్తకుండానే.

వెంకట్రావు ఒకసారి కాంతారావు వంక చూసి "సుబ్బారావుగారు! గుంటూరు సుబ్బారావుగారు" అన్నాడు తడుపుకోకుండా.

గుమాస్తా తలయెత్తి "గదులు ఖాళీ లేనట్టుందే!" అన్నాడు పరధ్యానంగా.

"రెండో మూడో ఖాళీగానే ఉన్నట్టున్నదే!" అన్నాడు వెంకట్రావు. "నాటక సమాజం వారెవరో మాట్లాడుకున్నా"రని చెప్పాడు గుమాస్తా.

"పోనీ, నా గదిలోనే ఉండరాదూ మీరు?" అన్నాడు వెంకట్రావు, కాంతారావు వంక తిరిగి. కాంతారావు ఉంటానని తల ఊపాడు. ఆ భాష కూడా అతనికి చాలా బాధకరంగా ఉన్నట్టుంది.

## 3

వెంకట్రావు సరదా మనిషి. అతనికి ప్రపంచం యావత్తూ ఆనందమయంగా ఉండాలి. తనచేత సుబ్బారావని నామకరణం చెయ్యబడ్డ కాంతారావు ఆ విధంగా ఘోస్టల్లే ఉండటం అతనికేమీ నచ్చలేదు. అతన్ని నవ్విద్దామని అనేక హాస్యాలు చెప్పాడు. భమిడిపాటి కామేశ్వర్రావు పొళ్లు కూడా ఏమీ పని చెయ్యలేదు. అతను నవ్వలేదు సరికదా, వినిపించుకున్నట్టు కూడా లేదు. ఒక్కొక్క ప్రయత్నమూ వ్యర్థమౌతున్న కొద్దీ ఈ మనిషిని రెచ్చగొట్టి మనిషిలోకి జీవం తీసుకురావాలని వెంకట్రావు తీర్మానం జాస్తికాసాగింది.

రంకు పురాణంలోకి దిగితే ఎట్లా ఉంటుందో?

"గాలివాన వచ్చిన సంవత్సరంలోనండీ! నేనప్పుడు మచిలీబందరులో ఉంటుండగా నండి, నాకు మణి అని ఒక పిల్లతో స్నేహమైంది. పిల్ల చాలా బాగుండేది సుమండి. మొగుడు వెధవ ఉత్తధనాసరి పీనుగని చెప్పుకునేవారు. వాడెప్పుడూ ముండలవెంట తిరిగే వాడుట. సరిగా రెండు నెల్లు. ఇంతలో నేను ఆ ఊర్నుంచి వెళ్ళిపోవలసొచ్చింది. నేను వెళ్ళిపోతుంటే ఆ పిల్ల ఎంత ఏడిచిందనుకున్నారు. మనం బాధ్యత నెత్తిమీద వేసుకుని పెళ్ళిళ్లు చేస్తామే గానండి, అసలు పెళ్ళిళ్ళు..."

వెంకట్రావుగారి సుబ్బారావు విచిత్రంగా ప్రవర్తించటం మొదలు పెట్టాడు. అతని మొహం ముందు ఎర్రగా అయింది. తరవాత అతని కళ్లు చలించటం మొదలు పెట్టినై జీవంతో. చివరకతను దెబ్బతిన్న వాడల్లే చివాలున లేచి వెంకట్రావు వంక ఒక్క క్షణం తీవ్రంగా చూసి చరచరా బయటికి వెళ్ళాడు.

వెంకట్రావు, పాపం, నిర్ఘాంతపోయినాడు. అతనికేమీ అర్థంకాలేదు. అతను బయటికొచ్చాడు. సుబ్బారావు లేడు. గబగబా వీథిలోకి వెళ్ళి చూశాడు. సుబ్బారావు ఎక్కడా కనిపించలేదు....

స్టేషనుకు పోయేదారిలో ఒక పెద్దమనిషి వెనకనించి వచ్చి ఏదో బలంగా టాకీ యిచ్చింది. ఆయన వెనక్కు తిరిగి చూస్తే సన్నటి పొడుగాటి మనిషి కనబడ్డాడు. ఇంకా

ఏదో క్షమాపణ వస్తుందని చూస్తున్నాడా పెద్దమనిషి. ఏదో గాలివాన విషయం గొణుక్కుంటూ ఆ సన్నటిమనిషి ఏమీ జరగనట్టే సాగిపోయినాడు. ఆ విధంగానే స్టేషనులో టిక్కెట్టు సరిచూస్తున్న మనిషికూడా టిక్కెట్లు సరిచూస్తూ ఈ సన్నని పొడుగాటి మనిషినే టిక్కెట్టు చూపించమని అడిగి టిక్కెట్టుకు బదులు గాలివాన విషయం ఏదో వినపడీ వినపడకుండా తెలుసుకున్నాడు....

కాంతారావు నిర్మానుష్యమైన బజారువెంట చరచరా నడుస్తూ తన ఇంటికి కొద్దిదూరంలో అకస్మాత్తుగా ఆగాడు.

"గాలివాన వచ్చిన సంవత్సరం! పందొమ్మిది వందల ఇరవై అయిదు! మణి ఏడేళ్ళది!"

అతని శరీరం ఒక్కసారి బిగుసుకుపోయింది. కాలు కదల్లేదు. ఎంతసేపట్లా నిలబడి ఉన్నాడో తెలీదు!

"కాంతం!"

కాంతారావు శరీరం జల్లుమంది. ఆ గొంతు తన నాయనమ్మది. ఉత్తర క్షణంలో ఆవిడే కనిపించింది. ఆవిడ చేతులో మందుసీసా! ఇంకెవరికి మందు?

"ఇదేమిట్రా కాంతం? ఎక్కడికెళ్ళావు! పాపం, అది ఒళ్ళు తెలిసినప్పటినించీ నీ కోసం ఒకటే కలవరిస్తున్నదిగదా!"

"ఎవరు?" ఆ మాట అడిగేటప్పుడు కాంతం గొంతు వణికింది, గాలికి ఆకల్లే.

"నీ పెళ్ళాం!"

అతని కళ్ళవెంబడి నీళ్ళు గిర్రున తిరిగినై. అది ఆనందమో, దుఃఖమో, లేక రెండూనో కాని అది భరించటానికసాధ్యంగా ఉంది. మైకం కమ్ముతుందేమోనన్నట్టు కాంతారావు గట్టిగా తొడగిల్లుకున్నాడు. వావిలాలవారి పెరట్లో చెట్లమీద చంద్రుడుదయిస్తున్నాడు. "పోరా, పాపం, మేలుకునే ఉంది. దానిక్కనపడు! కుర్రనాగమ్మా!" అంటున్నది నాయనమ్మ వెనకనించి. అతని కళ్ళు పిండినబట్టల్లే నీళ్ళోడుతున్నై.

చంద్రోదయాన్ని వదిలిపెట్టి పారిపోయిన వాడికి లేందీ చంద్రోదయానికెదురు పరిగెత్తేవాడి కెందు కీ దుఃఖం?

***మొదటి ముద్రణ : భారతి, మార్చి 1935***